ఈనాడు
వికారాబాద్
శనివారం సెప్టెంబరు 28, 2024

బాపూజీ సేవలు చిరస్మరణీయం



వికారాబాద్: బాపూజీ చిత్రపటం వద్ద అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్



తాండూరు: బీసీ సంఘం ఆధ్వర్యంలో నివాళులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో మరువలేని పాత్ర పోషించారని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మరో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి బాపూజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1969లో జరిగిన తెలంగాణ రాష్ట్ర సాధన తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఆయన ఆస్తులను సైతం ధారాదత్తం చేశారన్నారు. మంత్రి పదవిని సైతం త్యజించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సేవలను గుర్తించి బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఉపేందర్, డీపీఆర్వో చెన్నయ్య, ఏపీఆర్వో ప్రకాశ్ పాల్గొన్నారు.

తాండూరు టౌన్: పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుర కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, బీసీ సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

దారి అధ్వానం.. నడక నరకం



అధ్వాన దారిపై ప్రయాణం ఇబ్బందిగా మారిందని మదన్‌పల్లి, అత్వెల్లి, కొంపల్లి గ్రామస్థులు వాపోతున్నారు. రహదారిపై గుంతలు పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మదన్‌పల్లి సమీపంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు.– న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ.

ప్రతిభ వెలికితీసేవి యువజనోత్సవ పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వికారాబాద్ కలెక్టరేట్: ప్రభుత్వం యువకుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఏటా యువజనోత్సవాలను నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం అనంతగిరి హరిత రిసార్ట్‌లో జాతీయ యువజన, ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పోటీలను ప్రారంభించారు. స్వామి వివేకానంద ఆలోచనల ద్వారా యువతను చైతన్యం చేయడంతో దేశానికి మంచి భవిష్యత్తు అందుతుందన్నారు. దేశంలో అత్యధికంగా యువకులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా యువజన, క్రీడల అధికారి హన్మంత్‌రావు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో జానపద నృత్యం, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త ఐజయ్య, ప్రిన్సిపల్ పాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ఉత్తిదే..


• నిర్వహణ కరవైన నీటి ట్యాంకులు • కలుషిత జలాలతో ప్రజల అవస్థలు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రజలకు నిత్యం పరిశుభ్రమైన తాగునీటిని అందించాల్సి ఉండగా.. పలుచోట్ల నాచుపట్టిన జలాలు సరఫరా అవుతున్నాయి. ప్రధానంగా ట్యాంకుల శుభ్రతను గాలికొదిలేశారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని, విమర్శలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో అక్కడక్కడా పైపులైన్లు దెబ్బతిని నీరు కలుషితమవుతోంది. దీంతోపాటు పట్టణ ప్రాంతాల్లో బోర్ల నీటితో పాటు భగీరథ నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్.

తేదీ నమోదు చేయడం లేదు..



పాత తాండూరు: అంబేడ్కర్ ఉద్యానంలోని ట్యాంకు

తాండూరు టౌన్: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఉపరితల ట్యాంకుల్లో అపరిశుభ్రత నెలకొంది. 36 వార్డుల్లో 15వేల ఇళ్లు, 71 వేల పట్టణ జనాభా ఉంది. ఇళ్లకు రోజూ ట్యాంకుల నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. పట్టణంలో మొత్తం 8 ట్యాంకులున్నాయి. వాటిలో సగం అపరిశుభ్రంగానే దర్శనమిస్తున్నాయి. నెలలు గడుస్తున్నా శుభ్రం చేయడం లేదు. శుభ్రపర్చిన తేదీతోపాటు తరవాత ఎప్పుడనేది నమోదు చేయడం లేదు. అధికారులు సకాలంలో శుభ్రం చేయాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

వర్షా కాలంలో ఇబ్బందులు..



ధారూర్ వడ్డెర కాలనీలో నాచుపట్టి

ధారూర్: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో అప్పట్లో ఏర్పాటు చేసిన మంచినీటి మినీ ట్యాంకు నాచుపట్టి అపరిశుభ్రంగా మారింది. మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా అవుతోంది. సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు మినీట్యాంకు ద్వారా వస్తున్న నీటిని వాడుకుంటున్నామని స్థానికులు తెలిపారు. వర్షాలు కావడంతో అపరిశుభ్ర నీటితో రోగాలు వచ్చే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతున్నారు.

పాచిపట్టి.. ఆకుపచ్చ రంగులోకి..



పోచారపట్టి రంగుమారిన తాగునీటి ట్యాంకు ఇలా..

తాండూరు గ్రామీణ: తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. మండలంలోని 33 పంచాయతీల్లో 70కిపైగా ట్యాంకులున్నాయి. 70 శాతం ప్రజలు ట్యాంకుల ద్వారా వచ్చే నీటినే వాడుతున్నారు. సకాలంలో శుభ్రం చేయకుండా నీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ట్యాంకులు పాచిపట్టి ఆకుపచ్చ రంగులో దర్శనమిస్తున్నాయి.

కరవైన మరమ్మతులు



కుల్కచర్ల: నీటి ట్యాంకుల వద్ద పలుచోట్ల అపరిశుభ్రత నెలకొంది. మండల కేంద్రంలోని పేటగడ్డ ప్రాంతంలో ఉన్న ఉపరితల ట్యాంకు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అక్కడక్కడా పెచ్చులూడుతున్నాయి. మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

• పంచాయతీలు: 566 • మండలాలు: 20 • భూ ఉపరితల ట్యాంకులు: 871

దామగుండం.. కాపాడుకుందాం



దామగుండంలో సమావేశమైన ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు దామగుండాన్ని కాపాడుకుందామని నాయకులు అన్నారు. పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రం ఏర్పాటును వ్యతిరేకిస్తూ బీసీ సంఘం, విద్యావంతుల వేదిక, స్వేరోస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరులో నిరసన ర్యాలీ తీశారు. సబ్ కలెక్టరు కార్యాలయం దాకా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాజ్‌కుమార్, సయ్యద్ షకూర్, సీఐటీయూ శ్రీనివాస్, బుగ్గప్ప, తెరాసవి నాయకుడు దత్తాత్రేయ, నేతలు వెంకట్, లక్ష్మణ్‌చారి, రాము, రమేశ్, బసంత్, బస్వరాజ్, నరేశ్ పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న సంఘాల నేతలు

పరిరక్షణ ఐకాస ఛైర్మన్‌గా వెంకటయ్య..

పూడూరు: దామగుండం అటవీ పరిరక్షణ ఐకాస ఏర్పాటైంది. ఆలయ ప్రదేశంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. ఐకాస ఛైర్మన్‌గా దేవనోనిగూడకు చెందిన వెంకటయ్యను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గౌరవాధ్యక్షులుగా మాజీ ఎంపీపీ మల్లేశం, విజయ్ ఆర్య క్షత్రియ, సునంద, విజయలక్ష్మి పండిత్, కమిటీ సమన్వయకర్తలుగా సత్తయ్య, లక్ష్మయ్య, రామన్న, ఎరాన్‌పల్లి శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చన్న, వెంకట్‌రెడ్డితోపాటు 30 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తాండూరు టౌన్: యువత స్వశక్తితో ఎదగాలని భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో గ్లోబల్ యువతరం ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన యువతనుద్దేశించి మాట్లాడారు. యువత ఉద్యోగాల వేటలోనే కాకుండా వ్యాపారాలపైనా దృష్టి సారించాలన్నారు. పది మందికి ఉపాధి కల్పించాలన్నారు. స్వశక్తితో ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గంజాయి, గుట్కా, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలన్నారు. ఫౌండేషన్ యువతను చైతన్యపర్చడానికి కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధులు విజయేందర్, అరుణ్‌రాజ్, బీసీ సంఘం నాయకుడు రాజ్‌కుమార్, మార్వాడీ యువమంచ్ ప్రతినిధి మన్‌మోహన్ సార్డా, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి సంతోష్‌కుమార్, సామాజిక కార్యకర్త వెంకట్, మంబాపూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివేకానందుణ్ని ఆదర్శంగా తీసుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో రాంరెడ్డి

కొడంగల్, న్యూస్‌టుడే: దేశ కీర్తిప్రతిష్ఠలను ప్రపంచ స్థాయిలో గుర్తించేలా చేసిన మహనీయుడు వివేకానందుడని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా యువజన, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విజ్ఞాన మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 35 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారు తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అటవీ భూమి కబ్జా

737 ఎకరాలని తేల్చిన అధికారులు



అటవీ భూమిని పరిశీలిస్తున్న రేంజర్ రాజేందర్, సిబ్బంది

న్యూస్‌టుడే , బషీరాబాద్: కర్ణాటక సరిహద్దులో అన్యాక్రాంతమైన అటవీ భూముల లెక్కను బషీరాబాద్ రెవెన్యూ అధికారులు తేల్చారు. అటవీ, రెవెన్యూ భూములను ఏ గ్రామంలో ఎంత మంది కబ్జా చేశారని పూర్తి వివరాలు సేకరించారు. ఇటీవల బషీరాబాద్ పర్యటనకు వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు సంయుక్త సర్వేకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కర్ణాటక గుల్బర్గా జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సంయుక్తంగా సర్వే చేసి శాశ్వత పరిష్కారం చూపేందుకు కార్యాచరణ ప్రారంభించారు. వారం రోజులపాటు సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు కలిసి పరిశీలించి సర్వే చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని తహసీల్దార్ వెంకటయ్య తెలిపారు.

అన్యాక్రాంతం ఇలా..: బషీరాబాద్ మండలం మైల్వార్ సర్వే సంఖ్య 218/1, 235, నీళ్లపల్లిలో సర్వే నంబరు 35, ఇస్మాయిల్పూర్‌లో సర్వే నంబరు 20, జలాల్పూర్‌లో సర్వేనంబరు 69లో మొత్తం కలిపి 737 ఎకరాలు కబ్జాకు గురైందని అధికారులు తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన అటవీ భూమిలో కర్ణాటకకు చెందిన బొందెంపల్లి తండా, పలుగు కుచ్చతండా, కార్‌బార్ తండా, గోబ్రా నాయక్ తండా, ఇంద్రానగర్, భీమిలి తండా, హజార్ తండాకు చెందిన రైతులు 326 ఎకరాలు, బషీరాబాద్ మండలం మైల్వార్ తండా, ఇస్మాయిల్పూర్ తండా, జలాల్పూర్, నీళ్లపల్లికి చెందిన రైతులు 411 ఎకరాలు కబ్జా చేసినట్లు తేలింది. మైల్వార్ అటవీ ప్రాంతం 2,981.26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో ఇప్పటికే 1,014 ఎకరాలకు పట్టాలను ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసింది.

17 మందిని గుర్తించి..: మైల్వార్ అటవీప్రాంతంలో కబ్జా పర్వం కొనసాగుతూనే ఉంది. అధికారులు, సిబ్బంది బృందంగా ఏర్పడి నాలుగు రోజులుగా అడవిలో పర్యటించారు. రెండు రాష్ట్రాలకు చెందిన మరికొందరు రైతులు చెట్లు తొలగించి భూమిని చదును చేశారని, ఇప్పటివరకు 17 మందిని గుర్తించామని చెప్పారు. వీరిపై బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరంతరం నిఘా పెట్టి అడవి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తాండూరు రేంజ్ అధికారి రాజేందర్ తెలిపారు.

వయోవృద్ధుల వారోత్సవాల బహిష్కరణ

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నోసార్లు సమస్యలు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వయోవృద్ధుల వారోత్సవాలను బహిష్కరిస్తున్నామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, జిల్లా ప్రధాన కార్యదర్శి జూకారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వయోధికులకు ప్రత్యేక సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, నర్సింహారెడ్డి, విఠల్, దయానంద్ పాల్గొన్నారు.

రెండేళ్లలో అందుబాటులోకి కురుమ భవనం: ఎమ్మెల్యే



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అధునాతన హంగులతో హైదరాబాద్ రహదారి మార్గంలో కేటాయించిన స్థలంలో రెండేళ్లలో కురుమ భవనాన్ని అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కురుమ సంఘం తాండూరు మండల అధ్యక్షుడు జిన్‌గుర్తి నర్సింహులు ఆధ్వర్యంలో శుక్రవారం నూతన కార్యవర్గ బృందం ఎమ్మెల్యేను ప్రజాభవన్‌లో కలిసింది. కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీష్, సంఘం ప్రతినిధులు హన్మయ్య, చీమల నర్సింహులు, పల్లె వెంకటయ్య, చిట్టిగణాపూర్ రాజు, రాము, సురేష్, ఇందూరు బాలు, కిష్టప్ప, సాయిలు, మల్లప్ప పాల్గొన్నారు.

కవితల పుస్తకావిష్కరణ..

బషీరాబాద్: కవితలు, పద్యాలు రాసిన విద్యార్థులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సన్మానించారు. ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యంను అభినందించారు. మండలంలోని గొట్టిగఖుర్దులో ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం, 51 మంది బాలబాలికలు రాసిన కవితలున్న 'గొట్టిగఖుర్దు మణిపూసలు' పుస్తకాన్ని ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాధవరెడ్డి, సహకార సంఘం ఉపాధ్యక్షుడు అజయ్ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పార్వతీదేవి, మాజీ సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికే సభ్యత్వ నమోదు

మోమిన్‌పేట: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మోమిన్‌పేట దుర్గామాత ఆలయం ప్రాంగణంలో మండల స్థాయి పార్టీ సమావేశం మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేతలు వివేకానందరెడ్డి, వడ్లనందు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాండు భుజంగంరెడ్డి పాల్గొన్నారు.

రైతు సంఘాలతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

పెద్దేముల్, న్యూస్‌టుడే: రైతు సంఘాలతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తాండూర్ ఏకలవ్య ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం అంబురామేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంఘం మహాసభ సమావేశం అధ్యక్షుడు తుల్జప్ప అధ్యక్షతన జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. రైతు సంఘం ద్వారా అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారన్నారు. వ్యవసాయ విపణి ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఏడీఏ రుద్రమూర్తి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సాయికుమార్, సీఈవో అశోక్, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, బ్రహ్మం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఏర్పాటు..: శ్రీఅంబురామేశ్వర రైతు ఉత్పత్తిదారుల సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగులపల్లికి చెందిన పొట్టిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిషన్‌రావు, కోశాధికారిగా సావిత్రి, కార్యదర్శులుగా బుచ్చన్న, తుల్జప్పను ఎన్నుకున్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: గౌతాపూర్ శివారులోని బసవేశ్వరనగర్‌లో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అక్టోబరు 3 నుంచి దేవీనవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కోశాధికారి వాలిశ్రావణ్‌కుమార్ తెలిపారు. చెరువెంటి ఈశ్వరాలయం వద్ద 3 నుంచి 11 వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 7.30గంటల వరకు మహిళలు, యువతులతో బతుకమ్మ ఆటపాటలు నిర్వహిస్తామన్నారు.

వాగులు పొంగితే.. రాకపోకలు బంద్

న్యూస్‌టుడే, ధారూర్

ప్రభుత్వాలు, పాలకులు మారినా ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై అసంపూర్తి వంతెనలతో వాగులు పొంగినప్పుడు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని గ్రామాలకు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మరికొన్ని చోట్ల గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఎదురుచూపులే మిగిలాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



ధారూర్ రైల్వేస్టేషన్ సమీపంలో పారుతున్న వాగు

పుష్కర కాలం దాటినా..

మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని చింతకుంట, మైలారం, కొత్త తండాకు వెళ్లే దారిలో 2009లో వంతెన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు రూ.24 లక్షలతో పిల్లర్ల వరకు పనులు పూర్తి చేసి మధ్యలోనే వదిలేశారు. పనులు నిలిచిపోవడంతో ఉన్న నిధులూ వెనక్కి వెళ్లిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. వర్షాలకు వాగులు పొంగితే ఎవరూ వెళ్లరాదని చెబుతారే తప్ప వంతెన పనుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గతంలో వాగు దాటే క్రమంలో కొందరు ప్రాణాలు కోల్పోయారు.

అలుగు పారితే కష్టాలే..

కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు ఉద్ధృతికి నాగసమందర్ వెళ్లే రహదారిలో రోడ్డు 2016లో కొట్టుకుపోయింది. అప్పట్లో నెల రోజులపాటు రాకపోకలు నిలిచాయి.

అసంపూర్తి వంతెనలతో అవస్థలు

ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రూ.50 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. పూర్తి కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు పైనుంచి నీరు ప్రవహిస్తోంది. ప్రాజెక్టు అలుగు ఉద్ధృతికి కల్వర్టుపైనుంచి వరద నీరు పారుతుండడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కల్వర్టు ముందు భాగం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతోందనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ భారీ వంతెన నిర్మించాల్సి ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

తప్పని దూరాభారం..

భారీ వర్షాలకు 2016లో ధారూర్ రైల్వేస్టేషన్ దోర్నాల్ సమీపంలో మెథడిస్టు జాతర ప్రాంగణం వద్ద వంతెన కొట్టుకుపోయింది. దీంతో దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, నాగారం, మోమిన్‌కలాన్, రాస్నం, పగిడియాల్ తదితర 30 గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు మాత్రం సకాలంలో పూర్తి కాలేదు. వర్షాకాలంలో వరద ఉద్ధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రానికి రావాలంటే రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని మతాల సారమొక్కటే



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు


మోమిన్‌పేట, న్యూస్‌టుడే: అన్ని మతాల సారమొక్కటేనని, అందులోని భావాలను గుర్తించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్వగ్రామం రాళ్లగుడుపల్లెలో చర్చి నిర్మాణ పనుల శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో కుమార్తె శ్వేత కిషోర్‌కుమారుతో కలిసి పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి రూ.2లక్షల నగదును స్థానిక సంఘం సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని మతాల వారు కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేకవనంపల్లి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింలుగుప్తా, నాయకులు అరుణ్‌కుమార్, రమేష్, రాజేందర్, అంజయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బొంరాస్‌పేట మండలంలోని వివిధ పాఠశాల్లో సభ్యత్వ నమోదు చేయించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మోయిజ్‌ఖాన్, మల్లేష్, రహీం, అలీముద్దీన్, శివరాజ్, రమేష్, వెంకటయ్య మల్లప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. వృత్తి నైపుణ్యం!

● విద్యార్థులకు ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ



విద్యార్థి దశలోనే వృత్తి నైపుణ్యాలు పెంపొందిస్తూ.. పర్యావరణ హితం వైపు యోచించేలా జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) సంకల్పించింది. చిట్టి బుర్రలకు పదును పెట్టేలా.. కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్ఈడీ దీపాల తయారీ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా ఒక్కో జిల్లాకు పాఠశాలలను ఎంపిక చేసి తర్ఫీదు ఇస్తోంది. జిల్లా స్థాయిలో ఒక రోజు కార్యశాల చేపడుతోంది. సంగారెడ్డిలో 23, సిద్దిపేటలో 26 తేదీలలో నిర్వహించారు.

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సిద్దిపేట

అన్ని పాఠశాలల్లో..

ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ (ఏకో) క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (ఎల్ఐఎఫ్ఈ) థీమ్‌గా ఎంచుకొని ఏడు అంశాలను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎల్ఈడీ దీపాల తయారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.



ఉత్సాహంగా నేర్చుకున్నా:



ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీని ఉత్సాహంగా నేర్చుకున్నా. అధికారులు చక్కగా అవగాహన కల్పించారు. నేను ఓ ట్యూబ్ లైట్ తయారుచేశా. కేవలం రూ.వంద ఖర్చయ్యింది. దాన్ని పాఠశాలలోని ఓ గదిలో వినియోగిస్తున్నాం.

సహస్ర, విద్యార్థిని ఎద్దుమైలారం

సత్ఫలితాలు:

జపాన్ వంటి దేశాల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తి తయారు చేసే కుటీర పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఇందుకు దీటుగా భారత్ తయారు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. నైపుణ్యం పెంపొందిస్తే ఉపాధి సులువుగా లభిస్తుంది. విద్యార్థి దశ నుంచే అలవర్చడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయి.

బేతి భాస్కర్, జిల్లా ఎన్‌జీసీ సమన్వయ కర్త, సిద్దిపేట

200 పాఠశాలల్లో అమలు

జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణకు ఒక్కో జిల్లాకు 50 చొప్పున 200 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో బడిలో సైన్స్ ఉపాధ్యాయుడు, ముగ్గురు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. ఎల్ఈడీ దీపం తయారీపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి సమన్వయకర్త రాజశేఖర్ ఆధ్వర్యంలో నిపుణులు విద్యార్థులకు వివరిస్తున్నారు. పిల్లలతో వాటిని రూపొందింపజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తయారు చేసిన బల్బులు పాఠశాల, ఇంటి వద్ద వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు.

ఎల్ఈడీ ప్రయోజనాలు ఇలా..

● 90 శాతం విద్యుత్తు ఆదా. ● ఎక్కువ కాలం మన్నిక, దృఢంగా ఉంటాయి.
● ఉత్పత్తి చేసేందుకు తక్కువ ఖర్చవుతుంది.
● తయారీ ఖర్చు తక్కువ. ● ఉద్గారాలు తక్కువ శాతం వెలువడతాయి.

వాడే వస్తువులు, తయారీ

బల్బు తయారీకి ఎల్ఈడీ స్ట్రిప్, బీసీబీ, ట్రాన్స్‌ఫార్మర్, రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ను వాడుతారు. ముందుగా ఎల్ఈడీ స్ట్రిప్ పైభాగాన్ని తీసుకోవాలి. అందులో రెసిస్టర్, దయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సహాయంతో అన్ని భాగాలను బిగించాలి. 230 వాట్స్ ఉన్న విద్యుత్తును ఆటోమేటిక్‌గా 10 వాట్స్‌కు మార్చుకుంటుంది.

గగనతలంలో శిక్షణ..

లక్ష్య సాధనకు తపన

న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట టౌన్



నిరంజన్‌రెడ్డి

ఆసక్తి, ధైర్యానికి సాధన తోడైతే లక్ష్య సాధన పెద్ద కష్టమేమి కాదని నిరూపించారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నిరంజన్‌రెడ్డి. గగనతలంలో ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి చేశారు. బీకామ్ కంప్యూటర్స్ (తృతీయ) చదువుతున్న ఇతడి స్వస్థలం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి. తల్లిదండ్రులు లత, బ్రహ్మానందరెడ్డి. వ్యవసాయ కుటుంబం. ఆర్మీలో చేరాలనే తలంపుతో ప్రథమ సంవత్సరంలోనే ఎన్‌సీసీలో చేరారు.

త్రివిధ దళాల్లో కొలువే లక్ష్యంగా అడుగేసిన నిరంజన్‌రెడ్డి.. వాయుసేన ఆధ్వర్యంలో కొనసాగిన 23 రోజుల పారా బేసిక్ కోర్సు పూర్తి చేశారు. ఆగ్రాలో ఈ నెల 2 నుంచి 24 వరకు శిబిరం కొనసాగగా, కరీంనగర్ బెటాలియన్ నుంచి పాల్గొన్నది ఇతనొక్కడే కావడం విశేషం. పారా బేసిక్.. వాయుసేన విభాగంలో ప్రాథమిక స్థాయి శిక్షణ ఇచ్చే కోర్సు. దీనికి 175 మంది ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు 50 మంది పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసుకొని ధ్రువపత్రం అందుకున్న కేడెట్‌ను వైస్ ప్రిన్సిపల్ డా. పి. అయోధ్యరెడ్డి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, ఏవో సులేమాన్ అభినందించారు.

శిక్షణ సాగిందిలా..

తొలుత టేబుల్ (3 ఫీట్ల ఎత్తు) నుంచి దూకడం, నిలదొక్కుకునే తీరుపై మెలకువలు నేర్పించారు. కదిలే చక్రాలపై 9 అడుగుల ఎత్తు నుంచి దూకడం, తర్వాత 11 అడుగుల ఎత్తుపై నుంచి ప్యారాచూట్ ఆధారంగా దూకడం, గగనతల ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దూకే ముందు పాటించాల్సినవి నేర్పించారు. 12 రోజుల తర్వాత 30 అడుగుల ఎత్తు నుంచి దూకడాన్ని (ఫ్యాన్ టెస్టు) పరీక్షించారు. ఒకరోజు ఎరోప్లేన్‌లో 4 గంటలు ప్రయాణించారు. శిక్షణలో 15 రోజులు పూర్తయ్యాక రోప్లేన్ నుంచి నేరుగా దూకడం (1250 అడుగుల ఎత్తు) మొదలవుతుంది. 'ప్రారంభంలో కొంత భయమేసినా నిత్యం సాధనతో గొప్ప అనుభూతి కలిగింది. ఆర్మీలో ఉన్నత ఉద్యోగమే లక్ష్యమ'ని చెబుతున్నారు నిరంజన్‌రెడ్డి.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

పాపన్నపేట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని 33(టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ అధికారి రమేష్ సరియల్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ ధ్రువపత్రాలతో పోటీ పరీక్షల్లో మేలు కలుగుతుందని చెప్పారు. హెచ్ఎం మహేశ్వర్, సీటీవో ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.



సూచనలు చేస్తున్న రమేష్ సరియల్

మహనీయులను ఆదర్శంగా తీసుకోండి



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ రాములు తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ నీరజా ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, ప్రముఖ రచయిత బి.ఎస్.రాములు ఆకాంక్షించారు. శుక్రవారం ములుగులోని కొండా ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పుడు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. దేశం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయం 8వ వార్షికోత్సవ నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, సురేష్‌కుమార్, సుచిత్ర, చీనా, ప్రశాంత్, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తే విజయం ఖాయం



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే సృజనాత్మక శైలిని అలవర్చుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ సూచించారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. 6 నుంచి 9 తరగతి వరకు విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభ చాటుకునేందుకు కళా ఉత్సవ్ పోటీలు చక్కటి వేదికన్నారు. శ్రమిస్తే విజయం ఖాయమని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం హవేలిఘనపూర్ శివారులోని డైట్ కళాశాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, సిబ్బంది గురించి డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మాధ్యమంలో 100 సీట్లు కేటాయించాలని, అధ్యాపకులను నియమించాలని మహ్మద్ రియాజుద్దీన్.. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవోలు నీలకంఠం, మధుమోహన్, హెచ్ఎంలు కరుణాకర్, నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాప్‌లతో జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ బాబు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్: అనవసరమైన ప్రైవేట్ యాప్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ సంయుక్త సలహాదారు సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీ-డీఏసీ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి, ట్రాయ్ సీనియర్ రీసెర్చ్ అధికారి వెంకటపతి, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దాంపత్యానికి 'ఆదర్శం' తోడూనీడ

పూలదండల మార్పిడి, ప్రమాణ స్వీకారంతో వివాహం పూర్తి



నూతన దంపతులు శ్రీకాంత్, స్వేచ్ఛ, పార్టీ, సంఘం నేతలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆడంబరాలకు దూరంగా యువతి, యువకుడు శుక్రవారం సిద్దిపేటలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థిని స్వేచ్ఛ.. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఆదర్శ వివాహంతో ఒక్కటయ్యారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు పూలదండలు మార్పించి, ప్రమాణ పత్రం చదివించారు. హాజరైన సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి సూర్యం మాట్లాడారు. కుల, మత సంప్రదాయాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను పెంచుతోందన్నారు. వివాహాలను ఆడంబరంగా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దానికి భిన్నంగా శ్రీకాంత్-స్వేచ్ఛలు ఆదర్శ వివాహం చేసుకొని సమాజానికి సవాల్ విసిరారన్నారు. యువ జంటను నాయకులు ఆశీర్వదించారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు	125–00	
రిటైల్	147–00	
డ్రెస్డ్	213–00	
స్కిన్‌లెస్	243–00	

ఆవిర్భావ దినోత్సవం.. పోటెత్తిన భక్తజనం



మెదక్ పట్టణంలో భక్తుల భారీ ర్యాలీ



సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె.రూబెన్ మార్క్, మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య



చర్చి ప్రాంగణంలో శిలువ ఊరేగింపు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: చర్చి ఆఫ్ సౌత్ ఇండియా కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ వేడుకలను శుక్రవారం మెదక్‌లోని సీఎస్ఐ చర్చి ఘనంగా నిర్వహించారు. మెదక్ డయాసిస్ పరిధి ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సంఘాల జెండాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల కోలాటాలు, యువత నృత్యాల మధ్య భారీ ర్యాలీ కొనసాగింది. శిలువను ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించగా, డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా. కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టారు. దైవ సందేశం వినిపించారు. స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బిషప్ సతీమణి కె.ప్రిసిల్లా పరిమళ రూబెన్ మార్క్ జ్యోతి వెలిగించారు. భక్తబృందం పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● చర్చి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భవనంలో సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ఇన్‌ఛార్జి బిషప్.. మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్ఐ సంఘం విశ్వనీయత, విశిష్టతతో కూడుకున్నదని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు వేడుకలో పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. డయాసిస్ లే సెక్రటరీ ప్రభు కిరణ్, వైస్ ఛైర్మన్ విన్‌స్టన్, విమల్ సుకుమార్, జయానంద్, విల్సన్, సాల్మన్, గంట సంపత్, సాంసన్ సందీప్, స్టువర్ట్ ఫ్రాంక్ జాన్సన్, సువాన్ డగ్లస్, జోయల్, ఉమెన్ ప్రెసిడెంట్ ఎలిజబెత్, సెక్రటరీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనా మందిరంలో భక్తులు

ఐదునెలల్లోనే రూ.28.85 కోట్ల లాభాలు



సిద్దిపేటలో ఉద్యోగినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోలు కేవలం ఐదు నెలల వ్యవధిలో రూ.28.85 కోట్ల లాభాలు ఆర్జించాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. రాష్ట్రస్థాయిలో సిద్దిపేట ఆర్టీసీ డిపో లాభాల ఆర్జనలో తృతీయ స్థానం పొందిన నేపథ్యంలో శుక్రవారం సిద్దిపేటలో ఉద్యోగులు, సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎం 400 మంది డిపో ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ప్రగతిచక్రం అవార్డు, రూ.2 లక్షల పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే మూడు నెలలు పెళ్లిళ్లు, పండగల సీజన్‌లో మెరుగైన లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి నెలా ఇచ్చే ప్రగతి చక్రం అవార్డులను అందరూ అందుకోవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. సర్వీసుల సంఖ్య పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన ముగ్గురికి బహుమతులు అందజేశారు డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, దుబ్బాక ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి కనకలక్ష్మి, సిబ్బంది మౌలానా, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనిశాకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



షకీల్

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు పేరు మార్పిడికి అవసరమయ్యే ధ్రువపత్రం మంజూరు చేసేందుకు రూ.5వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఎండీ షకీల్ అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో చోటుచేసుకుంది. అనిశా డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన మాచేపల్లి అఫ్సర్ అదే గ్రామానికి చెందిన జి.దశరథ్‌కు చెందిన ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఆ ఇంటికి సంబంధించిన విద్యుత్తు మీటరును తన పేరుపైకి మార్చుకునేందుకు విద్యుత్తు శాఖకు గ్రామ పంచాయతీ నుంచి జారీ చేసిన ధ్రువపత్రం అందజేయాలి. ఇందుకోసం రెండేళ్ల నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. డబ్బులు ఇవ్వనిదే పని చేయలేమని ఇటీవల పంచాయతీ కార్యదర్శి షకీల్ స్పష్టం చేశాడు. ఇందుకోసం తొలుత రూ.25 వేలు డిమాండ్ చేసిన కార్యదర్శి.. చివరకు రూ.7వేలకు ఒప్పుకొన్నాడు. ఈ విషయంపై అనిశా అధికారులు అఫ్సర్ సమాచారమిచ్చాడు. కొండాపూర్‌లోని కార్యాలయంలో అఫ్సర్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని అనిశా అధికారులు పట్టుకున్నారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్-1064కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనిశా సీఐలు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మాయమైన రూ.4.50లక్షలు స్వాధీనం!

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మాయమైన రూ.4.50లక్షల నగదును పోలీసులు వారం రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన మహమ్మద్ రఫీ, రెహానా బేగం దంపతులు ఈనెల 19న మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షాపుర్‌నగర్ నుంచి కామారెడ్డి డిపోనకు చెందిన బస్సులో ప్రయాణిస్తుండగా.. కౌడిపల్లిలో నగదు ఉన్న సంచి మాయమైంది. దీనిపై స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిఘా కెమెరాలు, ఇతర మార్గాల్లో ఆ రోజు బ్యాగుతో సహా బస్సులో నుంచి దిగిపోయిన మహిళను గుర్తించారు. వారం రోజులు శ్రమించి మహిళను పట్టుకొని.. రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళగా గుర్తించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డిని వివరణ కోరగా.. నగదు స్వాధీనం చేసుకున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వనదుర్గమ్మను వీడని గంగమ్మ..



రాజగోపురంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



ఆలయం ముందు వరద ప్రవాహం

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నాలుగు రోజులుగా వరద కొనసాగుతోంది. శుక్రవారం వరద మరింత పెరగడంతో అర్చకులు కూడా అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 22,000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాలు.. అనంతపురం జిల్లా కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించి, కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టడంతో వినికిడి కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు.


న్యాయస్థానంలో ఫిర్యాదు: ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయగా పోలీసులపై కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధించారని కుటుంబసభ్యులు తెలిపారు. కేసును వెనక్కి తీసుకోవాలని, తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారని అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడని వాపోయారు. సిద్దిపేట బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారు దూరమయ్యారు. ఈ ఘటనలతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఢీకొన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు

● ప్రమాదంలో డ్రైవర్ మృతి ● దాదాపు 30మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన రెండు బస్సులు



నాగరాజు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు.. విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వెళుతోంది. హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో వస్తున్న మరో బస్సు కళాశాలకు అతి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాటిలో ఇరుక్కుపోయారు. విద్యార్థులతో వస్తున్న బస్సులో సుమారు 30 మంది వరకు ఉండగా.. వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల అద్దాలు పగలడంతో ముందు కూర్చున్న విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని గాయపడిన వారిని సంగారెడ్డి, నర్సాపూర్ ఆసుపత్రులకు తరలించారు. బస్సుల్లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీశారు. డ్రైవర్ నాగరాజు(56)ను నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో డ్రైవర్ యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు. ఉదయం ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. మృతి చెందిన డ్రైవర్ నాగరాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి కాగా.. పటాన్‌చెరులో స్థిరపడ్డారు. మృతుడు నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింగం చెప్పారు.

శౌచాలయాల నిర్వహణ కరువు

తాండూరు(గ్రామీణ: ఎనెల్లి శివారున్న ఆదర్శ పాఠశాల, కళాశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యా సంస్థలో 400 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ప్రతిరోజూ పాఠశాలకు వస్తుండగా తరగతిగృహాలు, శౌచాలయాల నిర్వహణలేక ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాల్లో అపరిశుభ్రత ఏర్పడుతోంది. వెంటనే ప్రభుత్వం కార్మికులను నియమించి పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

దేవాలయాల్లో నేడు క్షమాపణ మంత్రోచ్ఛారణ

తాండూరు టౌన్: తిరుమల, తిరుపతి దేవస్థానంలో భక్తులకు అందించే లడ్డూ అపవిత్రం అయిందని ప్రాయశ్చిత్తం కోసం తాండూరు పట్టణం, నియోజకవర్గంలోని ఆయా మండలాల గ్రామాల్లోని దేవాలయాల్లో శనివారం ఉదయం 9 గంటలకు క్షమాపణ మంత్రోచ్ఛారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తాటికొండ స్వప్న, కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో.. సమస్యల తిష్ఠ

న్యూస్‌టుడే, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట

భవనాలు లేవు, నిధులు కరువు

గ్రామ పంచాయతీలలో మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. కొన్ని గ్రామాలలో పంచాయతీలకు సొంత భవనాలు ఉన్నా.. పురాతనమైనవి కావడంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని నిర్మాణాలు పూర్తికాలేదు.

పరిస్థితి ఇలా..

● దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట, మాటూరు, సుల్తాన్‌పూర్ గ్రామాలకు ఉపాధిహామీ పథకంలో రూ.10లక్షల వ్యయంతో పదేళ్ల క్రితం గ్రామపంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. కానీ గుత్తేదారుల నిర్లక్ష్యంతో నేటికీ ఆ భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

● నందారం, దేవర్‌ఫస్లాబాద్, నీటూరు, గుమ్మాల, ఇందాపూర్, ఇతర గ్రామాల్లో పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయోనని సర్పంచుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లిలో గతంలో భవనం కూల్చివేశారు. నేటికీ నిర్మాణానికి నోచుకోలేదు.

● అప్పాయిపల్లిలో నూతన పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

● అంగడిరైచూర్‌లో కొత్త భవనం సగంలో వదిలేశారు. వీటితో పాటు ఎన్నో ప్రదేశాల్లో పంచాయతీ భవనాలు మంజూరైన నిర్మాణానికి నోచుకోలేదు.

● బొంరాస్‌పేట మండలాల్లో సగం గ్రామాలకు సొంతభవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించేందుకు వెతుకులాట. నాయకులు ఇళ్లలో నిర్వహిస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

పలు గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం చేశారు. ఇంకా కొన్ని చేయాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాల కోసం గ్రామపంచాయతీ నిధుల నుంచి పనులు చేయాలని సూచించామన్నారు. విడతల వారీగా గ్రామపంచాయతీలకు నూతన భవనాలు **-రవికిరణ్, పీఆర్ ఏఈ, కొడంగల్**



బిచ్చాలలో పంచాయతీ భవనం

పైసా లేక పరేషాన్

కుల్కచర్ల: 2018లో చేసిన చట్టం ప్రకారం జీపీలకు 15వ ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులు ప్రతి నెలా రావాలసి ఉంది. గడిచిన 24 నెలల్లో మూడు విడతలు మాత్రమే వచ్చాయి. జనాభా ఆధారంగా ప్రతి నెలా జీపీలకు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు అందాల్సి ఉంటుంది. కానీ రావడం లేదు. కుల్కచర్ల మండలంలో 32 గ్రామ పంచాయతీలు, చౌడాపూర్ మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన తరవాత గ్రామాల్లో కార్యదర్శులే ఏ చిన్న పని చేయించాల్సి ఉన్నా.. సొంతంగా డబ్బులను వెచ్చించి పనులను చేయిస్తున్నారు. నిధుల కోసం ఎన్నాళ్లని ఎదురు చూపులు చూడాలని వారు ప్రశ్నిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పూడూరు: ? గ్రామానికి సమీపంలో పొలాల మధ్యన విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. – శ్రీనివాస్, మాటూగూడ

✔ అవసరమున్న చోట అదనపు స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారుల పరిశీలనకు పంపించి సమస్యను తీరుస్తాం. – సందీప్, ఏఈ

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? తాండూరు పురపాలక సంఘం పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలోని వీధుల్లో చెత్తను పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. –రవి, తాండూరు.

✔ చెత్త కుప్పలు పూర్తి స్థాయిలో తొలగించటానికి చర్యలు తీసుకుంటాం. –విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? ఎర్రగొండ్ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేతి పంపు నిరుపయోగంగా మారింది. మరమ్మతులు చేయిస్తే మిషన్ భగీరథ నీటి సరఫరా లేని సమయంలో ఉపయోగకరంగా ఉంటుంది. – శ్రీను, స్థానికుడు

✔ పాఠశాల ఆవరణలో చేతి పంపు మరమ్మతులు చేయించేలా చూస్తాం. – హబీబ్ అహ్మద్, ఎంఈవో.

న్యూస్‌టుడే, కుల్కచర్ల: ? అనంతసాగర్ గ్రామం నుంచి తారు రోడ్డు వరకు మధ్య భాగంలో కొంత దూరం గుంతల మయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. –రాజు, అనంతసాగర్

✔ నిధుల కొరత ఉంది. నిధులు అందుబాటులోకి రాగానే తగిన దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనంతసాగర్.

భగీరథ.. నిత్యం వృథా

కొడంగల్ పల్లెల్లో దుస్థితి

న్యూస్‌టుడే, దౌల్తాబాద్, బొంరాస్‌పేట

సర్కారు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి భగీరథ నీటిని ప్రతి ఇంటికి అందిస్తోంది. అంతే కాదు. . చాలా పల్లెల్లో బోరుబావులకు సింగిల్ ఫేజ్ బోరు మోటార్లు ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతాల్లో మినీ ట్యాంకులను నిర్మించి నీటిని అందిస్తున్నారు. కానీ కొద్దిపాటి నిర్లక్ష్యంతో చాలా గ్రామాల్లో విలువైన జలం మట్టిపాలవుతోంది. దీంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆప్రాంతాల వాసులు వాపోతున్నారు.



కాడీడ్‌లో బోరు నీరు ఇలా..

మిషన్ భగీరథ అన్ని గ్రామాలకు ఉన్నా.. చాలా చోట్ల నల్లాలకు బిరడాలు అమర్చ లేదు.

● దుద్యాల, బొట్లోని తండా, మహంతీపూర్, లగచర్ల, అల్లీకాన్‌పల్లి, బుర్రితండా, దుప్చర్ల, మదన్‌పల్లితండా, ఏర్పుమల్ల, సాలిండపూర్, మహంతీపూర్ గ్రామాల్లో సింగిల్ ఫేజ్ బోరు మోటార్ల నుంచి రోజూ నీటి వృథా జరుగుతోంది.

● కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామంలోనూ ఇదే పరిస్థితి.● పర్సాపూర్ గ్రామాల్లో ఉపరితల జలభాండాగారాలు నిండిన తర్వాత వృథా అవుతోంది.

మచ్చుకు కొన్ని..

● దౌల్తాబాద్ మండలంలోని మాటూరు, కొడీడ్ గ్రామాల్లోని ఎస్సీ కాలనీలలో బోరు మోటార్ల నుంచి నీరు వృథా అవుతోంది.

● గుండెపల్లి, సంగాయిపల్లి, కుదురుమల్ల, మండలకేంద్రంలోని పలు కాలనీలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. బోర్ల వద్ద మినీ ట్యాంకులు నిర్మించలేదు. ఏ నల్లాకు బిరడాలు ఏర్పాటు చేయలేదు.

● బొంరాస్‌పేట మండలకేంద్రంలో

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లోని భగీరథ నుంచి, సింగిల్ ఫేజ్ బోరు మోటార్లు, మినీట్యాంకుల నుంచి నీరు వృథాగా పారకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. అన్ని గ్రామాల కార్యదర్శులతో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, ఎంపీడీవో, దౌల్తాబాద్

సహకార సంఘం మరింత అభివృద్ధి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్ల సహకార సంఘాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకుపోవలసిన అవసరం ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన మొగులయ్యను పీఏసీఎస్‌లో పార్టీ నాయకులు భరత్ తదితరులతో కలసి అభినందించారు.

‘పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం’

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ పురపాలక పరిధిలోని పాఠశాల/కళాశాల విద్యార్థులు నివసిస్తున్న ప్రాంతాలనే కాకుండా వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పుర కమిషనర్ జాకీర్ అహ్మద్ సూచించారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తగడి గురుకులంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పరిశుభ్రతగా ఉంటే రోగాలు దరిచేరవని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ స్రవంతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసుదాస్, పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొడంగల్: పురపాలికలోని ప్రజలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు.

కుల్కచర్ల గ్రామీణ: ఇళ్ల మధ్యన మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ముజాహిద్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ముజాహిద్‌పూర్ గ్రామంలో మురుగు నీటి నిల్వలను పరిశీలించారు.



కొత్తగడి గురుకులంలో మాట్లాడుతున్న పుర కమిషనర్ జాకీర్‌అహ్మద్

ప్రమాదవశాత్తు కిందపడి పెయింటర్ మృతి

పూడూరు, న్యూస్‌టుడే: ఇంటికి రంగులు వేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం అక్నాపూర్‌కు చెందిన బేగరి రాఘవులు(35) పెయింటర్. పూడూరు మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ ఇంటికి శుక్రవారం రంగులు వేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రాఘవులు

తాళం పగలగొట్టి.. పట్టపగలే చోరీ

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి నగలతోపాటు నగదును దొంగలు దోచుకెళ్లారు. ఈ సంఘటన పరిగి పురపాలికలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మైత్రినగర్ పక్కన ఉన్న శ్రీనివాస్ హిల్స్ కాలనీలో నివాసముంటున్న బుగ్గారెడ్డి కుటుంబంతో కలిసి కుల్కచర్ల మండల పరిధిలోని తన సొంత గ్రామానికి వెళ్లారు. సాయంత్రం వచ్చి ఇంటి తాళం తీయాలని చూడగా.. అప్పటికే తాళం పగలగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. అనుమానంతో వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంట్లో దాచిన 2తులాల బంగారు (ఉంగరాలు) నగలు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు గ్రహించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై తెలిపారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

పరిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీపై దిగులు అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ అమలవుతుందన్నారు. రూ.2 లక్షలపైబడి ఉన్న వారికీ త్వరలోనే మాఫీ వర్తిస్తుందని తెలిపారు. రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని తహసీల్దారు ఆనంద్‌రావుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కరీం, ఏపీవో ఉష, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం గ్యాస్ రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్స్, సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

రహదారి త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: కుల్కచర్ల మండల కేంద్రంలో రహదారి పనులను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రహదారి నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మండల కేంద్రంలో రెండు వరుసల రహదారి పనులను చేపట్టగా ఒక వరుస మాత్రమే పూర్తి అయిందని, మరో వరుస పనులను వెంటనే పూర్తి చేయించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: తాండూరు హిందూ ఉత్సవ సమితి భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. భవనం నిర్మాణ స్థలంలో భూమి చదును పనులను మొదటి రోజు ప్రారంభించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, సమితి కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

పరిగి: తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా పురఛైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు టి.వెంకటేష్, వి.రవీంద్ర తదితరులు నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



నివాళులర్పిస్తున్న ఛైర్మన్ అశోక్‌కుమార్, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

యాలాల: విద్యార్థులు మదకద్రవ్యాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌ఛార్జి శేఖర్ అన్నారు. శుక్రవారం యాలాల మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కళాబృందం, షీం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, కళాబృందం ఇన్‌ఛార్జి అశోక్ పాల్గొన్నారు.



షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

బడుల్లో నాణ్యమైన భోజనం ఇవ్వండి

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని బండవెల్కిచర్ల కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు శరత్‌కృష్ణ అన్నారు. బండవెల్కిచర్ల గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల, రాంనగర్, గోప్యాన్యాయక్ తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఆర్‌పీ కృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఊరిలో లేనివారి ఓట్లు తొలగించరూ..

బషీరాబాద్, న్యూస్‌టుడే: సుమారు 20 ఏళ్లుగా ఆ ఓటర్లు మా గ్రామంలో లేరు. కనీసం ఓటు వేయడానికి కూడారారు. విచారణ జరిపి ఆ ఓటర్లను తొలగించాలని గ్రామస్థులు తీర్మానం చేసి తహసీల్దార్ వెంకటయ్యకు విన్నవించారు. బషీరాబాద్ మండలం క్యాధిర గ్రామంలో 89 పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. పలుమార్లు వీరి పేర్లు తొలగించాలని విన్నవించినా.. జాబితా నుంచి తొలగిపోలేదు. మరోసారి విచారణ జరిపి తొలగించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగేంద్రయ్య తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ

పెద్దేముల్: అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంఘం ఆవరణలో సర్వేసభ్య సమావేశం జరిగింది. రూ.7.81 కోట్ల రుణ మాఫీ కోసం 886 మంది రైతులను గుర్తించామని చెప్పారు. 392 మంది రైతులకు సంబంధించిన రూ.2.83 కోట్ల రుణాలు మాఫీ కావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, డైరెక్టర్లు నరేందర్, మల్లేశం, మొగులప్ప పాల్గొన్నారు.

రాంపూర్ రహదారి అధ్వానం

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతిపల్లెకూ తారు రహదారి నిర్మిస్తామని ప్రకటించిన ప్రభుత్వం రాంపూర్‌తండాకు రహదారి నిర్మించేందుకు కంకర పరిచింది. నాలుగు సంవత్సరాలు దాటినా తారు పనులు చేపట్టకుండా వదిలేశారు. వెరసి కంకర మీదుగా ప్రయాణానికి రాంపూర్‌ఎగువతండా, రాంపూర్ దిగువతండా వాసులు అవస్థలు పడుతున్నారు. రహదారి దెబ్బతిన్నందున ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. పనుల నిమిత్తం పట్టణానికి వెళ్లాలంటూ.. ప్రైవేటు వాహనాలు దిక్కయ్యాయి. లేదంటే కాలినడకన మూడు కి.మీ. జాతీయ రహదారి దాకా ప్రయాణించాల్సిన పరిస్థితి. పాఠశాల, కళాశాలలకు వెళ్లే పదులసంఖ్య విద్యార్థులు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే తారు పనులు పూర్తి చేయించి రహదారిని అందుబాట్లోకి తీసుకురావాలని కోరుతున్నారు.



బోరు బాగు చేయిస్తే మేలు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపాన ఉన్న బోరు మోటారు కొన్నాళ్ల నుంచి పనిచేయడం లేదని స్థానికులు తెలిపారు. భగీరథ నీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు ఉంటున్నాయని, అటువంటి సమయాల్లో డైరెక్ట్ పంపింగ్ బోరు మోటారు ఉపయోగపడుతుందని అంటున్నారు. బోరు మోటారుకు తగిన మరమ్మతులు చేయించాలని తద్వారా సమస్య తీరుతుందంటున్నారు.



స్వచ్ఛంద సంస్థల సేవలు అవసరం

దోమ, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల సేవలు ఎంతగానో ఉపకరిస్తాయని దోమ మండల ఇన్‌ఛార్జి విద్యాధికారి వెంకట్ అన్నారు. శుక్రవారం అంకిత సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బొంపల్లి పాఠశాల విద్యార్థులకు చెప్పులు, బ్యాగులు, మ్యాట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాములు, ఎమ్మార్సీ శ్రీశైలం పాల్గొన్నారు.



విద్యార్థులకు అందించిన కిట్లు

పట్టణ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

తాండూరు టౌన్, తీన్యూస్‌టుడే: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులతో పురపాలక సంఘం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణవ్యాప్తంగా పూర్తిస్థాయి పారిశుద్ధ్య నిర్వహణకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. విజయదశమి నాటికి పట్టణంలో విద్యుత్తు సమస్య పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ పనులతో రోడ్లపై తవ్విన గుంతలను వెంటనే పూడ్చివేయాలన్నారు. కౌన్సిలర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు తాటికొండ స్వప్న, వ్యవసాయ విపణి అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఏఈఈ ఖజా హుసేన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాధికారులకు ఘన సత్కారం

పరిగి, న్యూస్‌టుడే: మండల విద్యాధికారులుగా నియమితులైన గోపాల్, హరిలాల్, వెంకట్‌లను శుక్రవారం పరిగిలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కె.హనుమంతు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.



సన్మానిస్తున్న హనుమంతు

ధారూర్: ధారూర్ ఎంఈవోగా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎంఈవో బదిలీ కావటంతో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డికి ఇన్‌ఛార్జిగా అధికారులు బాధ్యతలు ఇచ్చారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్‌లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

మర్పల్లి: మండల విద్యాధికారిగా కె.అంజిలయ్య బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి విద్యాధికారి విద్యాసాగర్ బదిలీపై వెళ్లారు.

బంట్వారం: మండల విద్యాధికారిగా వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ పనిచేస్తున్న విద్యాధికారి చంద్రప్ప బదిలీపై కోటిపల్లి మండలానికి వెళ్లారు.

జాతీయ రహదారి పక్కనే వ్యర్థ జలాలు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు-చించోళి జాతీయ రహదారిని ఆనుకొని మోత్కువాడుక వద్ద వ్యర్థ జలాలను రహదారి మీదకు వదులుతున్నారు. దీంతో రహదారిపై మడుగు మారింది. వ్యర్థ జలాలు నిలిచి అపరిశుభ్రంగా మారింది. వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అందుబాటులో రాయితీ శనగ, కుసుమ విత్తనాలు

పూడూరు, న్యూస్‌టుడే: రాయితీపై శనగలు, కుసుమ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో తులసీరాం ఓ ప్రకటనలో తెలిపారు. యాసంగిలో సాగుచేసుకునే రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం నకలు చూపించి ఏఈవోల వద్ద పర్మిట్లు తీసుకుని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాల ద్వారా విత్తనాలు పొందాలని సూచించారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: అవయవ లోపానికి గురైన చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యం మెరుగుపరిచే పోషకాహారాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో విజయలక్ష్మి, సీడీపీవో ప్రవీణ అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయురాలకు సూచించారు. శుక్రవారం పోషణ మాసోత్సవంలో భాగంగా మర్పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయి సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు రషీద్ జిల్లా సమన్వయకర్త హర్షిత పర్యవేక్షణాధికారులు రిజ్వాన, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పూడూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక ఆహారం తీసుకుంటే ఆరోగ్య కరమని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి తెలిపారు. మన్నెగూడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాశన, వెల్ బేబీషో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్ కళమ్మ ఆయా చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి